కథానిక:

# మెరుపు మెరిసింది

'జాస్మిన్'




పగలు తొమ్మిదిన్నర.
వర్షం! వర్షం!
దిక్కుమాలిన వర్షం.
వర్షంతో గాలి, చలి, తడి, బురద.
ఏకధారగా వర్షం.
బాధ, వర్షపు బాధ.
ఉంటే అతివృష్టి. లేకపోతే అనావృష్టి.
ప్రస్తుతం అతివృష్టి బాధ.
గుమ్మంలో నిల్చుంది నీరజ, గొడుగు పట్టుకుని.
అద్దెగదులు రెండూ కురుస్తున్నాయి.
నేలంతా తడి.
ఆస్పత్రిలో పేషంట్సులా గదంతా మాసిన బట్టలు.
మాసిన గోడలు.
పాత కేలెండర్లమీద బొమ్మలు.
మాస్టర్ విఠల్.
జాల్ మర్చెంట్.
ఇ, బిలోమొరియా.
మాధురి.
గోహర్.
సులోచన.
గోడలమీద వేళ్లాడుతున్నారు.
ఆమె చదువుకుంటున్న రోజుల్లో హీరోస్ ఎన్డ్ హీరోయిన్స్.
ప్రస్తుతం మాసిన గోడలనుంచి నవ్వుతున్నారు.
వారి నవ్వువైపు చూడ్డంలేదు నీరజ.
వీధిలోకి చూస్తోంది.
వర్షం, వర్షం.
టప టప మని వర్షం.
గొడుగు విప్పింది నీరజ. చిరిగింది గొడుగు అక్కడా అక్కడా.
వీధిలో అడుగు వేసింది నీరజ.
పగలు తొమ్మిదిన్నర.
పదిగంటలకి స్కూలు.
రెండుమైళ్లు వెళ్లాలి బస్సులో.
పది నిమిషాలు నడవాలి బస్సుస్టాండ్‌కి.
వెయిట్ చెయ్యాలి బస్సుకోసం
ఎంతసేపో?
వెళ్లాలి బస్సులో. తడిలో, చింకిగొడుగుతో. కంపుకొట్టే మనుష్యులమధ్య నలుగుతూ.
ఇవాళ స్కూల్కి వెళ్లడం ఎలాగూ ఆలస్యం అవుతుంది.
లేటుగా వెళ్తే మబ్బులో ఆకాశం మూసుకుపోయినట్టు మూసుకుపోతుంది హెడ్‌మిస్ట్రెస్ ముఖం.
కానీ.
"వర్షంపడ్డానికి నేను కర్తనా?"
వర్షం పడుతూంది.
దిక్కుమాలిన వర్షం.
౧౯౩౭లో చేరింది టీచర్‌గా,
ఇరవై సంవత్సరాల వయసులో,
ఇంటర్మీడియేటు పాసయేక.
అంతవరకే తన చదువు.
బియ్యేకి చదువుదామంటే పొట్ట అడ్డొచ్చింది.
డబ్బు, డబ్బు.
జీవితాంతంవరకూ దానికోసం తాపత్రయపడ్డం.

అది లేక బాధపడ్డం.
ఎన్నాళ్లిలా గడపడం?
చచ్చేవరకూ ఇంతే కాబోలు!
గుండెల్లో పెట్టుకున్న ఆశ లేవీ?
ఏవీ?
ఒక్కటీ లేదే!
లవ్!
రొమాన్స్!
మేరేజ్!
మనీ!
ఒక్కటీ లేదే!
ఆశ లన్నీ మట్టిపా లయేయి.
నీళ్ళపా లయేయి.
నీళ్లు, ఎక్కడ చూసినా నీళ్లు.
కార్లు పోతోంటే బురదనీరు చీరమీదకి చిమ్మతోంది.
తడిసిన చీర ఎలానూ తడిసింది.
తడిచీరమీద చలిబాధ మరీ హెచ్చుగా ఉంది.
గుండెల్లోంచి వణుకు పుట్టుకొస్తోంది.
"ముసల్దాన్నయిపోతున్నాను"
పదిహేనేళ్ల క్రితం గాల్లో తేల్తూ స్కూలుకి వెళ్లింది.
అప్పుడు తనకి ఇరవయ్యేళ్లు.
ఇప్పుడు ముప్ఫయ్యయిదు.

Niraja Is Thirtyfive Years Old· Old !!!

"ముసల్దాన్నయిపోతున్నాను"
తనది ముప్ఫయ్యయిదు వర్షాల ప్రాయం.
ముప్ఫయ్యయిదు వసంతాల ప్రాయం ఎందుక్కాకూడదు?
కాదు.
తనది వసంతాలప్రాయం కాదు.
వర్షాల ప్రాయమే.
వర్షం, వర్షం.
జోరుగా. పక్కవాటుగా, పొడుస్తూ వర్షం.
పెళ్లయితే తన పిల్లలు వెళ్లవలసింది స్కూలుకి.
పెళ్లికాలేదు తనకి.
పెళ్ళయే ఆశ లేదు.
వివాహయోగం లేని జాతకం.
ఒకప్పుడు పెళ్ళవుతుందని ఆశపడ్డది.
చాలాకాలం క్రితం.
ఇరవై సంవత్సరాల క్రితం,
పదిహేనేళ్ళ పడుచుపిల్ల.
పద్ధెనిమిదేళ్ళ పడుచుపిల్లడు.
పక్కింటినుంచి చూపులు.
పక్కింటిమీదికి చూపులు.
ఉత్తరాలు.
కాదు.
ప్రేమలేఖలు.
పెరట్లో,
చీకట్లో,
కౌగిలింతలు.
నిద్దర్లో కలలు.
అంతే.
ఎవరిదారి వారిది.
అటుతరువాత?
ఇంకే ఆశా లేదు.
తనకి పెళ్లి చేయించే వృద్ధులూ లేరు.
పెళ్లాడ్డానికి యువకులూ లేరు.
తనవైపెవరూ చూడలేదు. చూడరు.
తనెవరికీ అక్కర్లేదు.
"నాగతి ఏం కాను?"
ఇంతే. ఇలాగే. వర్షంలో, చలిలో, చింకిగొడుగుతో. బడిపిల్లలకి పాఠాలు చెప్తో.
ఆఖరికి చస్తే శవాన్ని మోసుకెళ్లడానిక్కూడా ఎవరూ ఉండరు.
ఛా. ఏమిటీ ఆలోచనలు?
అవి కాక ఇంకేముంది తనకి?
వర్షం, వర్షం,
బస్సుస్టాండ్
సైన్‌పోస్టు తడుస్తోంది.
ఇంకెవరూ లేరు.
అవును. ఎవరుంటారు, నీరజ తప్ప?
ఆ సైన్‌పోస్టూ, తనూ తప్ప ఇంకెవరూ ఈ వర్షంలో తడవరు.
ఎండ కెండి వానకి తడవ్వలసిందే.
వర్షంలో బాధపడాల్సిందే.
బస్సు ఎంతకీ రాదు.

ఇవాళ ఎలాగూ ఆలస్యం అవుతుంది.

డబ్బుంటే కారుమీద వెళ్లవచ్చు హాయిగా.

డబ్బు రావడం ఎలా ?

వస్తే స్కూల్లో టీచర్ గా ఉండే ఖర్మ మేం?

అయ్యో రాతా !

ఈ బస్సు రాదు.

వస్తే ఆగకుండా పోతుంది. సీ టుండదు.

Niraja Always Misses The Bus.

అదిగో బస్సు, దూరంగా.

ముందేదో కారు అడ్డుతూంది.

బస్సులో నిల్చోవాలి.

ఏ మొగాడూ లేచి తనకి సీ టివ్వడు.

అందంగా ఉంటే ఇస్తారు.

నీరజకి అందం లేదు కాబోలు.

"పైవాళ్ళకి తెలియాలి. నామట్టుకు నే నందం గానే వున్నాను"

బస్సు తెగజోరు గా వస్తోంది!

కారుని తప్పించుకుని వచ్చింది ముందుకు.

స్లో డౌన్ కాలేదు. రోడ్డుమధ్య గావస్తోంది.

అయితే ఖాళీ లేదన్నమాటే !

వచ్చింది.

వెళ్లిపోయింది, పిచికారీలా నీళ్లు చిమ్ముతూ.

అనుకున్నట్టుగానే అయింది.

ఇంకా 'వెయిట్' చెయ్యాలి మరో బస్సు కోసం.

వెనకాతల కారు మెల్లిగా వస్తూంది.

నంబరు ౧౨౩.

నిల్చోవాలి తను, ఒకటి రెండూ మూడూ అంటూ నిమిషాలు లెక్కెడుతూ.

జీవితాంతంవరకూ అలా లెక్క పెడుతూ నిల్చోవలసిందే,

ఆగని బస్సులకోసం,

దొరకని సౌఖ్యాలకోసం,

తీరని కోరికల్తో,

తీరనిబాధతో.

ఈ సారహీనపు జీవితం అంతమయేవరకూ అంతే.

వర్షం, వర్షం.

బస్సుస్టాండు దగ్గర కారాగింది.

ఇక్కడెందు కాగింది ?

"మీ రెక్కడికి వెళ్తున్నారో తెలుసుకో వచ్చునా ?"

స్టీరింగ్ వీల్ దగ్గర కూర్చుని వంగి చూస్తూ అడిగేడు.

ఒక్కడే ఉన్నాడు కార్లో. జుత్తు తగ్గుతోంది. నుదురు ఎదుగుతోంది. ఎర్రటి కళ్లు. నల్లటి ఫ్రేం కళ్లద్దాలు. మట్టిరంగు ఉలెన్ కోటు, అదేరంగు నెక్ టై. నవ్వే ముఖం.

ఆరోగ్యమైన శరీరం. నలభైలోపు వయసు.

అన్నీ ఒక్కక్షణంలో కనిపెట్టింది ఆరితేరిన కళ్లతో.

"మిడిల్ స్కూల్ కి వెళ్లాలండీ"

"దార్లోనే ఉంది. మీ కభ్యంతరం లేకపోతే కూర్చోండి"

తలుపు తీసేడు.

వర్షం, వర్షం.

కార్లో కూర్చుంది. "థాంక్స్" చెప్పింది.

"దానికేం లెండి. చంపేస్తోం దీ వర్షం"

సిగరెట్టువాసన. ఖరీదైన సిగరెట్టు వాసన,

రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. ఖరీదైన సెంటువాసన.

చేతిని వాచీలో అరు నిమిషాల్తక్కువ పది.

కారు కదిలింది.

నీరజగుండెలు కదుల్తున్నాయి జోరుగా.

కలవరపడుతోంది నీరజ

చేతిలో ఉన్న గొడుగు వణుకుతోంది.

మాట్లాడ్డానికేం తోచలేదు.

అతనే అడిగేడు.

"స్కూల్లో టీచరుగా ఉన్నారా ?"

"అ... అ... వునండీ"

అతని ముఖం నవ్వుతోంది.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుగా జ్ఞాపకమండీ"

ఆ మాటకి గుండె లెందుకో దడదడ కొట్టుకున్నాయి. రక్తం వెచ్చగా ప్రవహించింది.

పద్దెనిమిదేళ్ల పడుచుపిల్ల డెందుకో స్ఫురణ కొచ్చేడు.

ఈ వయసే ఉంటుంది.

ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం !!
పిచ్చి ఊహ.
పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్లడానాడే పోయేడు.
మళ్ళీ రాడు.
కథల్లో నే మళ్ళీ కనిపిస్తారు పోయిన నాయకులు.
కాని రక్తం జోరుగా ప్రవహిస్తోంది.
కారు జోరు చేసేడు.
సందు మళ్ళాలి.
జోరు తగ్గలేదు.
కారు మలుపు తిరిగింది జోరుగా.
ఊపుకి అతని ఎడంభుజంమీద వాలింది.
వెచ్చగా, వెచ్చగా;
సువాసన. మొగజంతువువాసన.
వాంఛ రేగింది. ఆశ కలిగింది. సర్దుకుంది. సరిగా కూర్చుంది.
చూపు ముందుకి తిప్పింది.
ఎదురుగా స్కూలు.
ఆగింది కారు.
"మెనీ థాంక్స్"
"నా పెటాల్"
"ఛీరియో"
"ఛీరియో"
అంతే.
పదిగంటలు సరిగా.
వర్షం, వర్షం.
అమ్మయ్య! టైముకి వచ్చేను.
"సంతసానికి ఇంతకి మించిన కారణా ల్లేవు నాకు"
స్కూలుకి టైముకి వచ్చేను. క్లాసులో పిల్లలు అల్లరిచెయ్యలేదు. ఇంటివాడు అద్దెకి పేచీపెట్టలేదు.
"ఇంతచిన్న విషయాలే నాకు సంతోషం కలుగజేసేవి."
No higher pleasures IN this life.
వర్షం, వర్షం!
కాని
ఆ రాత్రి మనసు అకారణంగా తేలిగ్గా ఉంది.
వర్షం పడుతోంది. చూర్లోంచి నీరు దిగుతోంది. చలివేస్తోంది.
నీరజకి నిద్ర రాదు.
రోజూ నిరాశవల్ల నిద్ర రాదు.
ఇవాళ ఆశవల్ల నిద్ర రాదు.
వర్షం, వర్షం.
చలి, చలి.
ముణుచుకు పడుక్కుంటే వెచ్చగా తేలిగ్గా ఉంది.
తలుపుల్లేని కిటికీలోంచి చీకటిని తోసేస్తూ, మెరుపులు!
ఒకటీ, రెండూ, మూడూ.
వర్షంలో వాహనం.
వాహనంలో రసికుడు.
విత్తనం చిన్నదైనా మర్రిచెట్టు పెద్దదే.
"ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం"
పద్దెనిమిదేళ్ల పడుచుపిల్లడు.
అనుకోకుండా ఆరంభిస్తుంది వలపు.
మెరపు. మరో మెరుపు.
"నా మనసులో ఆశలు మెరుస్తున్నాయి" మెరుపుల్ని ఆశతో సరిపోల్చేడు కవి.
ఆఖరికి నాక్కూడా "Hope"
పద్దెనిమిదేళ్ల పడుచుపిల్ల, డెక్కడున్నాడో!
నలభైయ్యేళ్లదగ్గ రుంటుం దతని వయ సిప్పుడు.
ఒకటీ, రెండూ, మూడూ,
అతన్దీ అదే వయసు.
నవ్వుతూంటే ముఖం.
అబ్బ, అదేదో సువాసన.
భుజం, వెచ్చగా,
"ఏమిటీ ఆలోచనలు నాకు?"
అత నెవరో నే నెవరో?
మళ్లీ కనిపిస్తాడా?
మెరుపు.
అదిగో మెరిసింది. కనిపిస్తాడు మళ్లీ.
"నా గుండెలేనా కొట్టుకుంటున్నాయి?"
"దడదడ, ఒకటి, దడదడ, రెండు...!"
నల్లటి కారుమీద తెల్లటి నంబరు. వర్షంలో తడుస్తూంది తను. బటలు తడిసి ముద్దయేయి. కారు, రెక్కలకారు వాలింది. వర్షం పోయింది. పరుపు. మెత్తటి పరుపు. వెచ్చటి శాలువలు. కమ్మని మల్లెపూలు.
చీర మారింది. చెంపలమీద వేడిచేతులు. [illegible]

పులమీద వేడి పెదవులు. వెచ్చగా... హెడ్‌మిస్ట్రెస్ ఏడుస్తోంది... ఈర్ష్యతో... ఏడవనీ... వెచ్చటి పెదవులు... చుట్టూ పిల్లలు... పనసపళ్ళలాంటి పిల్లలు... కేరుతూ, ఆడుతూ... కారు. మెరుపులు... ముద్దులు... సిగరెట్టు... వాసన... స్కూలుమీదకి మండుతున్న సిగరెట్టు... మంటలు.,. మంటల మెరుపులు... చలిమంటదగ్గర నీరజ. అతను... వెచ్చగా... హాయిగా...

ఆ మర్నాడు
నీరజ నిద్రలేచింది.
వర్షం తెలియలేదు.
నష్టమేం లేదు.
బద్ధకం, తెగబద్ధకం,
అమ్మో, ఎనిమిదయింది.
గబగబా, గబగబా,
ఎందుకీ ఉత్సాహం.

ఈ జీవి కింకా ఆశలూ, కోరికలూ ఉన్నాయా?

"నా కాశ ల్లేవు"
అయితే అకారణంగా ఎందుకీ సంతోషం?
కారణం ఉంది.
ఒకటి రెండూ మూడూ
నిజంగా అదే కారణం.
అచ్చే కాదు. మనసు ఒప్పుకోదు.
కాని నిజంగా అదే కారణం.
వర్షం, వర్షం.
ఇంకా పడాలి.
గబగబా తయారయింది, తొమ్మిదిన్నరకల్లా.
సరిగ్గా తొమ్మిదిన్నరకి బయల్దేరింది.
నిన్న కూడా అదే వేళ.
నిన్న కూడా వర్షం.
వర్షం, వర్షం.
ఇవాళ కూడా పడుతూంది.

బస్సుస్టాండుదగ్గ రెవరూ ఉండరు, తనూ సైన్ పోస్టూ తప్ప. బస్సులో సీటుండదు.

ఒకటీ, రెండూ, మూడూ.
"...అభ్యంతరం లేకపోతే"

వెచ్చటి స్పర్శ! మొగవాడిదగ్గరుండే మధురమైన వాసన. . . . . . . .

ధబ్ ధబ్ ధబ్ ధబ్.
కొట్టుకుంటున్నాయి గుండెలు.
నడుస్తూంది జోరుగా, తేలిగ్గా.
పదిహేనుసంవత్సరాల క్రితం,
ప్రప్రథమం స్కూలుకి టీచర్గా వెళ్ళినప్పుడు ఇలాగే తేలిగ్గా వెళ్ళింది.
నిజంగా పదిహేనేళ్ళయిందా?
ఆశ్చర్యం! నిన్న కాక మొన్న జరిగినట్టుంది.
"నాలో ఏ మార్పూ లేదే?"
ఇంకా తేలిగ్గా, ఇంకా జోరుగా.
వర్షం, వర్షం.
నీరు తుళ్ళుతోంది వెనకన.
కారు చిమ్ముతోంది నీరు.
చూసింది చటుక్కున.
ఒకటి రెండూ మూడూ.
పోతోంది కారు.
పోతున్నాడు చూడకుండా.
నిజంగా చూడకపోడం కాదు.
ఆమె ఆడది. ఆమె తెలుసుకోగలదు.
చూడనట్టు నటించి వెళ్ళిపోయేడు.
వెళ్ళిపోతున్నాడు.
అయ్యో, అదిగో బస్‌స్టాండ్.
ఆగింది కారు.
ఎక్కుతున్నారు కాల్లోకి ఇద్దరు.
ఇద్దరూ ఆడవాళ్ళు.
తొణికిసలాడుతున్నారు యవ్వనంలో.
కిలకిల లాడుతున్నారు ఆనందంతో.
జిలజిలలాడుతున్నారు కాంతుతో,
సాగిపోయింది వాళ్ళతో
మొగవాడి వాసనతో
నిండిన మోటారుకారు.
ధబ్. ధబ్. ధబ్ ధబ్.
అకారణంగా ఈర్ష్య. అకారణంగా నిరాశ.
ఆశించమని ఎవరన్నారు?
"ఛా. నా కాశలున్నాయని ఎవరన్నారు?"
"ఛా. ఈ వయసులోనా నా కిటువంటి ఆశలు?"
"నాకే ఆశలూ లేవు. నిరాశలూ లేవు"
అయినా బాధ,
వర్షం, వర్షం.

దిక్కుమాలిన వర్షం.
బస్ స్టాండ్.
బస్సు వచ్చింది. సీటు ఉన్నాది.
"బ్రతుకు జీవుడా!"
పగలల్లా వర్షం.
రాత్రయింది.
ఇంకా వర్షం.
నీరజకి నిద్ర రాదు.
ముప్ఫయ్యాయిదేళ్ల జీవితం.
వ్యర్థం, వ్యర్థం,
జీవితమంతా వ్యర్థం.
మెరుపులు, మెరుపులు.
వ్యర్థం, వ్యర్థం,
నేనూ, స్కూలూ, స్టూడెంట్సూ,
వ్యర్థం,
వాళ్లకి నేర్చుకుందామనే ఉత్సాహమూ లేదు.
నాకు నేర్పుదామనే ఆసక్తీ లేదు.
అయినా ఇలా సాగవలసిందే.
పోయే డెక్కడికో,
పద్ధెనిమిదేళ్ళ పడుచుపిల్లడు.
దాన్తో సరి.
మెరుపులు మెరుపులు.
ఒకటీ రెండూ మూడూ.
హాస్యాస్పదం.
నవ్విపోతారు;
కారు పోయింది వయసుమళ్లిన షరసుడితో.

మెరుపులు. మెరుపులు,
ఆశతో సరిపోల్చేడు కవి.
అదిగో మెరుపు.
కాని మాయమయింది.
మళ్లీ మెరిసింది.
మాయమయింది.
ఇంతే. ఇంతే,
ఆఖరికిదే నిజం.
ఈ చీకటే నిజం.
నిజం, నిజం.
చీకటి నిజం.
ఇలా ఉండవలసిందే తను.
ఏకాకిగా, నిరాశతో.
నీరజ స్కూలుకి వెళ్తుంది.
నీరజ స్కూలునుంచి వస్తుంది.
వయసు వెళ్తుంది.
చావు వస్తుంది.
మెరుపు మెరిసింది.
అదిగో మాయమయింది.
ఆఖరికింతే.

ఈ అంధకారంలో ఇలా వంటరిగా. నిరాశతో. దారిద్ర్యంతో, బాధతో, వర్షంలో చలితో, వంటరిగా... వంటరిగా... వంట... రిగా...వం...ట... రి...గా...

మెరుపుమెరిసింది.
మాయమయింది.

